క్లుప్తంగా

వాలీబాల్ విజేతలకు బహుమతులు పంపిణీ



ఫిరంగిపురం: మండలంలోని బేతపూడిలోని హైస్కూల్ మైదానంలో బ్లడ్ బాయ్స్ ఆధ్వర్యంలో వారం రోజులుగా వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో బేతపూడితో పాటు పొనుగుపాడు, సంక్రాంతిపాడు, మునగపాడు గ్రామాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఆదివారం నిర్వహించిన పోటీలో సంక్రాంతిపాడు గ్రామానికి చెందిన క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. విజేతలకు ఎంపీటీసీ సభ్యుడు షేక్ ఖాసిం షాహిద్ ట్రోఫీతో పాటు రూ.5,116 అందజేశారు.

ఈదురు గాలులతో నేల కూలిన చెట్టు



తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఈదురు గాలులు వీచాయి. రహదారి వెంబడి ఉన్న వృక్షాలు పడిపోయాయి. ఉండవల్లి అమరావతి రోడ్డులో గెస్ట్ హౌస్ వద్ద, ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి ఆక్వాడెవిల్స్ దగ్గర, చెట్లు పడ్డాయి. మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారి వెంబడి ఎండిపోయిన వృక్షాలు కొమ్మలు రోడ్లపై పడడంతో స్వల్పంగా ట్రాఫిక్ నిలిచిపోయింది. రోడ్డుపై పడిన చెట్ల కొమ్మలను స్థానికులు తొలగించడంతో ట్రాఫిక్ పునరుద్ధరించారు. 15 రోజుల నుంచి ఎండలు విపరీతంగా ఉండి ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అయ్యారు. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో వృద్ధులు, చిన్నారులు ఊపిరి పీల్చుకున్నారు.

జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన తేజో



మంగళగిరి: జేఈఈ మెయిన్స్‌లో మంగళగిరి విద్యార్థి 99.43 పర్సంటైల్ మార్కులు సాధించి ప్రతిభ కనబర్చాడు. మంగళగిరికి చెందిన మాజేటి పార్థసాధి-పార్వతి దంపతుల కుమారుడు తేజో రామ విఘ్నేశ్వర్ శనివారం విడుదలైన జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో 99.43 పర్సంటైల్ మార్కులు సాధించాడు. విఘ్నేశ్వర్ జేఈఈ మెయిన్స్‌లో రాణించడంపై మంగళగిరికి చెందిన పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

బీసీ బాలుర వసతి గృహంలో ప్రత్యేక శిక్షణ తరగతులు

మంగళగిరి: నగరంలోని బీసీ బాలుర వసతి గృహంలో ఆదివారం ఉచిత ప్రత్యేక శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఉన్నత విద్య-ఉద్యోగ అవకాశాలు అనే అంశంపై కేఎల్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. వసతి గృహ విద్యార్థుల సంక్షేమం కోసం వారిలో వివిధ సబ్జెక్టులపై అవగాహన కల్పించేందుకు అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లతో ప్రతి వారం శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వసతి గృహ సంక్షేమ అధికారి రాజోలు శ్రీను తెలిపారు.

చిరు వ్యాపారులకు తోపుడుబండ్ల అందజేత

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని మెల్లెంపూడిలో చిరువ్యాపారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సహకారంతో ఆదివారం తోపుడు బండ్లను అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు రాజా రామిరెడ్డి మాట్లాడుతూ మెల్లెంపూడిలో నివాసముండే షేక్ గాలీబు, ఇంకుర్తి ఉషారాణి చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని వీరిద్దరిని ఎమ్మెల్యే ఆర్కే సౌజన్యంతో తోపుడు బండ్లు అందజేశామని రామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణారెడ్డి(నాని), శివరామిరెడ్డి, శేఖర్, నాగులు, షేర్‌ఖాన్, అలాంబుడే, శివశంకర్‌రెడ్డి, వెంకటప్పా రెడ్డి, బాషా, రాములు పాల్గొన్నారు.

నేడు నృసింహుని దేవస్థాన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన

మంగళగిరి: నగరంలోని మన్నెం వారి వీధిలోని శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి సంబంధించిన స్థలంలో నూతనంగా నిర్మించతలపెట్టిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సోమవారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) శంకుస్థాపన చేయనున్నట్లు దేవస్థాన ఈఓ ఎ.రామకోటిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఖాళీ స్థలం చుట్టూ నిర్మించిన ప్రహరీను ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ప్రారంభించనున్నట్లు చెప్పారు.

ఆహ్లాదం.. ఆనందం

మంగళగిరి: నగర పరిధిలోని ఎయిమ్స్ పక్కన ఉన్న టెంపుల్ హిల్ ఏకో పార్క్ ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. ఆరోగ్యంతో పాటు ఆహ్లాదాన్ని పంచుకునేందుకు రెండు కొండల మధ్య పచ్చదనంతో నిండి ఉన్న టెంపుల్ హిల్ ఏకో పార్క్‌తో పాటు గండాలయస్వామి కొండపైకి నూతనంగా ఏర్పాటు చేసిన ట్రెక్కింగ్ ట్రాక్‌లో వాకింగ్ చేస్తూ కొండపైకి చేరుకున్నారు. క్రీడా మైదానంలో వ్యాయామం చేసి ఆటలాడుకున్నారు. పలువురు చిన్నారులు షార్ట్ ఫిల్మ్ కోసం చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. గుంటూరు, విజయవాడ ప్రాంతాల నుంచి వాకర్స్ ట్రెక్కర్స్ భారీగా తరలిరావడంతో పార్కు వద్ద వాహనాలు భారీగా బారులు తీరాయి. ప్రత్యేకంగా వాకర్స్ కోసం జ్యూస్ పాయింట్ ఏర్పాటు చేశారు. ఆదివారం ఆటవిడుపుతో నగరంలోని టెంపుల్ హిల్ ఎకో పార్క్ కోలాహలంగా మారింది.



ఏకో పార్కు ముఖద్వారం వద్ద విద్యార్థుల నృత్య ప్రదర్శన



షార్ట్ ఫిల్మ్ షూటింగ్



జ్యూస్ పాయింట్ల వద్ద బారులు తీరిన వాకర్స్

మత్స్యకారులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

తాడేపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మత్స్యకారులను ప్రోత్సహించేందుకు ఫిష్ ఆంధ్ర మాల్‌ను సబ్సిడీలపై ఏర్పాటు చేస్తోందని వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి అన్నారు. ఆదివారం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నులకపేటలో ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర మాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న అపారమైన మత్స్య సంపదను ఇక్కడే అమ్ముకునే విధంగా ప్రభుత్వం మత్స్యకారులకు అవకాశం కల్పించిందని చెప్పారు. ప్రతి ప్రాంతంలో చేపలు వ్యాపారం చేసుకునే ప్రతి ఒక్కరికి 75 శాతం సబ్సిడీ ఇచ్చి ఫిష్‌మాల్స్‌ను ఏర్పాటు చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు, యువజన నాయకులు మున్నంగి వివేకానందరెడ్డి, ఉండవల్లి సచివాలయ మత్స్యశాఖ అసిస్టెంట్ సమన్వయకర్త అనిల్ పాల్గొన్నారు.



నులకపేటలో ఫిష్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు అందజేత

తాడేపల్లిరూరల్: యువకుల్లో ఉన్న ప్రతిభను వెలికితీయడమే క్రికెట్ పోటీల ముఖ్య ఉద్దేశమని కళ్లం ఫౌండేషన్ నిర్వాహకులు కళ్లం గోవిందరెడ్డి అన్నారు. మంగళగిరి- తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పెనుమాకలోని జూనియర్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహిస్తున్న క్రికెట టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో మొత్తం 64 టీమ్‌లు పాల్గొనగా, రెండో రౌండ్‌కు 32 టీమ్‌లు చేరుకోవడంతో రెండో రౌండ్ మ్యాచ్‌లు ఆదివారం మొదలయ్యాయి. మొదటి మ్యాచ్‌లో అజిత్‌టీమ్, శ్రీ ఇన్ఫోటెక్ టీమ్ పోటీ పడగా మొదట బ్యాటింగ్ చేసిన అజిత్ టీమ్ 16 ఓవర్లలో 114 పరుగులు చేసి ఆలౌట్ కాగా, శ్రీ ఇన్ఫోటెక్ టీమ్ నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 107 పరుగులు చేసింది. దీంతో అజిత్ టీమ్ 7 పరుగులతో విజయం సాధించింది. అనంతరం 175 సీసీ, ఎంఎస్‌కే సీసీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 175 సీసీ జట్టు 6 వికెట్లు కోల్పోయి 97 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎంఎస్‌కే సీసీ జట్టు 82 పరుగులకు ఆలౌట్ కావడంతో 175 సీసీ జట్టును విజయం వరించింది. ఈ మ్యాచ్‌లలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అజయ్‌కు టోర్నీ నిర్వాహకులు కళ్ళం గోవిందురెడ్డి చేతుల మీదుగా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేశారు. ఆ తరువాత జరిగిన మూడో మ్యాచ్‌లో ఆంధ్ర ఎంప్లాయిస్ సీసీ, క్రేజీ క్రికెటర్స్ జట్ల మధ్య మ్యాచ్ జరగ్గా మొదటగా బ్యాటింగ్ చేసిన ఆంధ్ర ఎంప్లాయిస్ సీసీ జట్టు 16 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 107 పరుగులు చేయగా, క్రేజీ క్రికెటర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 99 పరుగులు చేసింది. దీంతో ఆంధ్ర ఎంప్లాయిస్ సీసీ జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రవీణ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును గరుగు సుబ్బారెడ్డి అందజేశారని అన్నారు. యువకుల్లో ఉన్న ప్రతిభను వెలికితీయడానికి క్రీడలు చాలా దోహదపడతాయని, తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టెన్నిస్, క్రికెట్ పోటీలు మాత్రమే కాకుండా ఇంకా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న కళ్లం గోవిందురెడ్డి

వైభవంగా వాసవీ కన్యకాపరమేశ్వరి గ్రామోత్సవం

మంగళగిరి: నగరంలోని మెయిన్ బజారులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం లక్ష్మీ గణపతి కోదండ రామ స్వామి దేవస్థానం ఆవరణలో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలశాల ఊరేగింపు, సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. సాయంత్రం ఆరు గంటలకు వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆయా కూడళ్లలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి గ్రామోత్సవం

రైల్వే ట్రాక్‌పై యువకుడి ఆత్మహత్య

తాడేపల్లిరూరల్: మంగళగిరి- తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కొలనుకొండ రైల్వేస్టేషన్ సమీపంలో ఓ యువకుడు ఆదివారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. వడ్డేశ్వరానికి చెందిన మర్రి సూరిబాబు, మహాలక్ష్మమ్మ దంపతుల రెండో కుమారుడు కిరణ్‌కుమార్(24) ఇంజినీరింగ్ పూర్తిచేశాడు. విజయవాడలో చిన్న ఉద్యోగం చేస్తూ హైదరాబాద్‌లో ఉద్యోగం రావడంతో ఆదివారం సాయంత్రం హైదరాబాద్ ప్రయాణం కావాల్సి ఉంది. శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత ఇంటికి రావడంతో తల్లి మందలించింది. మనస్తాపానికి గురై ఇంట్లో నుంచి బయటకు వచ్చేసిన కిరణ్‌కుమార్ చెన్నై విజయవాడ రైల్వే ట్రాక్‌పై తలపెట్టి పడుకోవడంతో రైలు ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. కిరణ్‌కుమార్ మొండెం, తల వేరువేరు అయ్యాయి. రైల్వే సిబ్బంది కిరణ్‌జేబులో ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఘటనపై తెనాలి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో కాల భైరవ హోమం

మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెం శివాలయం ఆవరణలో శనివారం రాత్రి కాల భైరవ హోమ పూజలు ఘనంగా నిర్వహించారు. యర్రబాలెంకు చెందిన నాయుడు శ్రీనివాసరావు- నాగేశ్వరమ్మ, అనిల్ కుమార్, శిరీష, ధర్మతేజ, భార్గవి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన కాల భైరవ హోమ పూజలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్చక స్వాములు పూర్ణసాయి, రామకృష్ణ, శ్రీనివాస్ కాల భైరవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.



కాల భైరవ హోమంలో పాల్గొన్న భక్తులు

వేమవరంలో బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు

ఫిరంగిపురం: మండలంలోని వేమవరంలోని గోవిందమాంబసమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద స్వామికి విశేష అర్చనలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు వేద పండితులు అయ్యన్నశాస్త్రి, రోహిత్‌శాస్త్రి, కార్తిక్‌శాస్త్రి నిర్వహించారు. ఆరాధన జెండాకు పూజలు చేసి అలంకరించిన వాహనంలో ఉంచి గ్రామంలో ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రామచంద్రాపురంలో..

తాడేపల్లిరూరల్: మంగళగిరి రూరల్ పరిధిలోని రామచంద్రాపురంలో ఆదివారం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వామి ఆరాధనా మహోత్సవాన్ని అంగరంగ వైభంగా నిర్వహించారు. దేవాలయ నిర్వాహకులు భీమిరెడ్డి అంజిరెడ్డి ఆధ్వర్యంలో స్వామికి పంచామృత, హరిద్ర, గంధ, విభూతి, వివిధ రకాల ద్రవ్యాలతో ఉత్సవ మూర్తులకు అభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నృసింహుని ఆలయం వద్ద అల్పాహారం పంపిణీ

మంగళగిరి: నగరంలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయం వద్ద పద్మజ్యోతి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు, వృద్ధులకు, దివ్యాంగులకు, భక్తులకు అల్పాహారం, రాగి జావ పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీనియర్ న్యాయవాది వేమూరి రత్న ప్రసాద్, ఉమారాణి దంపతులు అల్పాహార పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపకులు జి.వెంకట పూర్ణచంద్రరావు, న్యాయవాది టి.నరసింహారావు, బాలకృష్ణ, హేమచంద్ర గుప్తా, బి.ప్రసాద్, కె.శ్రీనివాస్, జి.సుందరరావు, జి.మురహరిరావు, ప్రభాకర్, రమేష్ పాల్గొన్నారు.

కదిలిన ల్యాప్‌టాప్ చోరీ కేసు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న ప్రైవేట్ హాస్టల్ రూమ్స్‌లో చోరీకి గురైన ల్యాప్‌టాప్ కేసులో పోలీసులకు చిన్న క్లూ దొరకడంతో దాని ఆధారంగా ల్యాప్‌టాప్ దొంగల డొంకను కదలించారు. వివరాలు.. తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ల్యాప్‌టాప్‌లు దొంగతనాలకు గురయ్యాయంటూ ఫిర్యాదులు అందాయి. విచారణంలో భాగంగా వాటర్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న ఓ యువకుడు ల్యాప్‌టాప్‌లు అమ్ముతున్నాడని సమాచారం రావడంతో ఆదివారం అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతడి వద్ద నుంచి 4 ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పోలీసులు మాత్రం ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని, ఆ వ్యక్తి విచారిస్తున్నామని, త్వరలోనే వివరాలు వెల్లడిస్తున్నామని చెబుతున్నారు.

దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ

మంగళగిరి: నగర పరిధి యర్రబాలెం శివాలయం సెంటర్‌లో స్థానిక యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి చలివేంద్రంలో ఆదివారం దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు. దివంగత గొల్లపూడి మోహనరావు జ్ఞాపకార్థం కుమారుడు, నగరపాలక సంస్థ వర్క్ ఇన్‌స్పెక్టర్ గొల్లపూడి గోపిరాజు, దివంగత రేమిణిశెట్టి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం కుమారుడు, ఇస్రో ఉద్యోగి రేమిణిశెట్టి కోటేశ్వరరావు బాటసారులు, వాహనదారులకు 200 లీటర్ల మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో భీమవరపు వెంకట్రావు, లేళ్ల నరసింహారావు, మక్కే కిరణ్, గంధం సురేష్ పాల్గొన్నారు.

బేతపూడిలో మా నమ్మకం నువ్వే జగన్

ఫిరంగిపురం: మండలంలోని బేతపూడిలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు వివరించి మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లను అందజేశారు. ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం, భరోసా కల్పిస్తున్నారు. కార్యక్రమంలో రేపూడి మార్కెట్ యార్డు డైరెక్టర్ షేక్ ఖాజావలి, గృహసారథి షేక్ ఖాసింషాహిద్, సచివాలయం కన్వీనర్ దిల్షాద్‌లు పాల్గొన్నారు.

బహిరంగ ప్రాంతాల్లో మద్యం తాగితే చర్యలు

మంగళగిరి: నగర పరిధిలో బహిరంగంగా మద్యం తాగే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ ఎస్ఐ క్రాంతి కిరణ్ హెచ్చరించారు. ఆదివారం నగర పరిధిలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న పలువురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగంగా మద్యం తాగి ఇతరులకు ఇబ్బంది కలిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నగరంలోని ఆయా వైన్స్‌ల వద్ద నిరంతరం నిఘా ఏర్పాటు చేసి మద్యం తాగే వారిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. అప్పటికీ బహిరంగంగా మద్యం సేవించడాన్ని మానకపోతే చర్యలు తప్పవన్నారు.

ప్రజలకు ఆహ్లాదం, ఆరోగ్యం అందించడమే ధ్యేయం

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)
- స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ రింక్ నిర్మాణ పనుల పరిశీలన

మంగళగిరి: నగర ప్రజలకు ఆహ్లాదకర వాతావరణంతో పాటు మంచి ఆరోగ్యాన్ని అందించాలనే లక్ష్యంతో ఇండోర్ స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ రింక్ నిర్మాణాలను చేపట్టినట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అన్నారు. ఆదివారం ఆయన ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవితో కలసి నగరంలోని తెనాలి రోడ్డు రక్షిత తాగునీటి పథకం ఆవరణలో తుది దశకు చేరుకున్న స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ రింక్ నిర్మాణాలను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి అంటే రోడ్లు, డ్రెయిన్లు నిర్మించడమే కాదన్నారు. విస్తరిస్తున్న నగరానికి అనుగుణంగా ప్రజలకు మెరుగైన పూర్తిస్థాయి సౌకర్యాలను కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. అందులో భాగంగా నగర ప్రజలకు ఆహ్లాదం అందించడంతో పాటు ఆరోగ్యం అందించాలనే ధ్యేయంతో సుమారు రూ.3 కోట్లతో ఇండోర్ స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ రింక్‌ల నిర్మాణాలను చేపట్టామన్నారు. మే నెల 15వ తేదీ నాటికి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్ పాల్గొన్నారు.



పనులపై చర్చిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

అదనపు జిల్లా కోర్టు పనులు పరిశీలన..

నగర పరిధిలోని కోర్టు ఆవరణలో జరుగుతున్న అదనపు జిల్లా కోర్టు అభివృద్ధి పనులను ఆదివారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) పరిశీలించారు. సుమారు రూ.30 లక్షల నిధులతో జిల్లా అదనపు కోర్టు కొరకు నిర్మాణాలు కొనసాగుతున్నాయని, త్వరితగతిన పూర్తి చేయాలని నగర పాలక సంస్థ అధికారులకు సూచించారు.

రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో దంత వైద్య శిబిరం

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని మెల్లెంపూడి గ్రామ సచివాలయంలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి, మోడరన్ డెంటల్ కేర్ ఆధ్వర్యంలో ఉచిత డెంటల్ క్యాంప్ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు మున్నంగి వివేకానందరెడ్డి మాట్లాడుతూ ఉచిత డెంటల్ కేర్ క్యాంప్‌కు విశేష స్పందన లభించిందని, 52 మందికి డెంటల్ సంబంధిత సమస్యలతో ఉన్న వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామని అన్నారు. మోడరన్ డెంటల్ కేర్ వైద్యులు డాక్టర్ జయశ్రీ మాట్లాడుతూ డెంటల్ సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని, ముందు తెలుసుకుని పరీక్షలు చేయించుకుంటే పంటి సమస్యలను అరికట్టవచ్చని అన్నారు. మనం ఏదైనా ఆహారం తినాలంటే దంతాలే ముఖ్యమని అన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి గ్రామ వికాస్ ప్రాజెక్ట్ చైర్మన్ చంద్రా ఓబులారెడ్డి, ప్రసాద్ రెడ్డి, శంకరశెట్టి రమేష్, ఆర్‌సిసి సభ్యులు రాజా రామిరెడ్డి, మాజీ ఎంపిటిసి ఈదులమూడి శేఖర్, షేక్ సుల్తానా, మోడరన్ డెంటల్ కేర్ వైద్యులు డాక్టర్ హరిప్రియ పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహించిన మోడరన్ డెంటల్ కేర్ వైద్యులు డాక్టర్ జయశ్రీ

నేటి నుంచి విరామ బైబిల్ పాఠశాల తరగతులు

మంగళగిరి: నగరంలోని పార్కు రోడ్డు ఇమ్మానియేలు చర్చిలో విరామ బైబిల్ పాఠశాల తరగతులు సోమవారం నుంచి ఈనెల 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పాస్టర్ బి.రవి ప్రకాష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు ఉంటుందని చెప్పారు. పిల్లలకు కథలు, కంఠత వ్యాఖ్యలు, ఆటలు, పాటలు, డ్రాయింగ్స్, మ్యూజిక్ షో, పప్పెట్ షో ఏర్పాటు చేసి వారికి స్నాక్స్, భోజనం అందజేయడం జరుగుతుందన్నారు. చర్చి ఆవరణలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పాస్టర్లు జి.సునీల్, ఎస్.సతీష్, విమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

తోట పత్మాస్ ప్రార్థనా మందిరంలో ...

నగరంలోని క్రోసూరివారితోట తోట పత్మాస్ ప్రార్థనా మందిరంలో సోమవారం నుంచి వేసవి విరామ బైబిల్ పాఠశాల తరగతులు నిర్వహించనున్నట్లు పాస్టర్లు విక్టర్ తిమోతి, శేషుబాబు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 7.30 నుంచి 10.30 వరకు నిర్వహించనున్న తరగతులను విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

కనకపుట్టమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

పూజల్లో పాల్గొన్న వ్యవసాయ శాఖ మాజీ మంత్రి కన్నబాబు దంపతులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పెదకొండూరులోని శ్రీ కనకపుట్టమ్మ తల్లి దేవస్థానంలో మాజీ వ్యవసాయ శాఖమంత్రి కన్నబాబు దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శంకరరావు ప్రత్యేక ఏర్పాట్లు నిర్వహించి మాజీ వ్యవసాయ శాఖ మంత్రి కన్నబాబు దంపతులకు ఘన స్వాగతం పలికారు. పూజ కార్యక్రమాల అనంతరం వేద ఆశీర్వచనం చేసి దంపతులను సత్కరించారు. తదుపరి వైఎస్సార్ సీపీ పెదకొండూరు పార్టీ కన్వీనర్ బర్మా అర్జునరావు, నాయకులు కొండూరు శేషులు కన్నబాబుకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మలబంటి శ్రీరామమూర్తి, బెల్లకొండ శ్రీనివాసరావు, వి. శంకర్, గోపి, అశోక్, సాయి, రవి, బుల్లబ్బాయి, సుబ్బారావు పాల్గొన్నారు.



కనకపుట్టమ్మ తల్లి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కన్నబాబు దంపతులు

వైభవంగా కన్యకా పరమేశ్వరి జయంత్యుత్సవాలు

పాత గుంటూరు: ఆర్ అగ్రహారంలోనికన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఆదివారం అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం, సేవాదళ్, మహిళా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అమ్మవారి జయంత్యుత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం విశేష పూజలు, లక్ష్మీ గణపతి హోమం, చండీహోమం, వాస్తుహోమం, నవగ్రహ హోమం, క్షీరాభిషేకం, 108 కలశలతో గ్రామోత్సవం, అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం విద్యుత్ దీపాలంకరణతో గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు షేక్ మహమ్మద్ ముస్తఫా, మద్దాలి గిరిధర్ రావు పూజలు నిర్వహించి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. వారిని ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కార్యక్రమాన్ని సంఘాల అధ్యక్షులు ఆతుకూరి నగేష్‌కుమార్, అమరా శ్రీనివాసరావు, మొగిలి సతీష్ కుమార్, యిమ్మడిశెట్టి ప్రమీలారాణి, కార్యదర్శులు యేచూరి వెంకయ్య, జి. మహేష్, రంగా మురళీకృష్ణ, అమరా షర్మిల, కోశాధికారులు రవి కుమార్, కె.నాగేంద్ర, శ్రీకాంత్, నాగ పరిపూర్ణ పర్యవేక్షించారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాలి గిరిధర్‌రావు

చికిత్స పొందుతూ మహిళ మృతి

మేడికొండూరు: ఇంటిపై నుంచి జారి కిందపడి తీవ్ర గాయాలైన మహిళ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మండలంలోని వరగాని గ్రామానికి చెందిన మాగులూరి కల్యాణి(22) శనివారం తమ ఇంటి పైకి ఎక్కింది. ఉన్నట్టుండి ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో ఇంటి పై నుంచి కిందకు పడిపోయింది. ఈ ఘటనలో కల్యాణికి తీవ్ర గాయాలయ్యాయి స్థానికులు ఆమెను గుంటూరు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేశారు.



మృతి చెందిన కల్యాణి